క్లుప్తంగా

ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నిధులు కేటాయించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. కడపలోని తమ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సమావేశాలలో కడప ఉక్కుకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్నారన్నారు. పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో డీఈసీ సభ్యుడు మృతి


శివహరిప్రసాద్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ(డీఈసీ) సభ్యుడు, కడప ప్రభుత్వ జూనియర్ కళాశాల గణిత అధ్యాపకుడు ఎస్.శివ హరిప్రసాద్‌రెడ్డి బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన పార్థివదేహాన్ని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్‌ఐవో) బండి వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు సందర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

భక్తులకు అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న జయచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: మహా శివరాత్రి సందర్భంగా పొలతల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం చింతకొమ్మ దిన్నె గ్రామ శివారున చెన్నంరెడ్డి లక్ష్మిరెడ్డి, సుబ్బలక్ష్మమ్మ దంపతులు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రజుమంలో బాల సుబ్బారెడ్డి, రాజారెడ్డి, సుబ్బరాయుడు, హుస్సేన్, శ్రీను, శ్రీధర్ పాల్గొన్నారు.

మీ నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేస్తాం

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోటక్రిష్ణ పేర్కొన్నారు. పులివెందులకు వచ్చిన మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

మైనార్టీ సమస్యలపై పోరాడతాం

జిల్లాలో ముస్లిం మైనార్టీల సమస్యలపై పోరాడతామని వైఎస్సార్‌సీపీ కడప అసెంబ్లీ నియోజవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎస్ఎండీ. షఫీ అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం ఆయన కలిసి ఘనంగా సత్కరించారు. షఫీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ స్థాపించినప్పటి నుంచి మైనార్టీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

వర్క్ ఇన్స్‌పెక్టర్ మృతికి మేయర్ సంతాపం


మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేస్తున్న మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్ర బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మేయర్ సురేష్ బాబు చంద్ర మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కుటుంబానికి కార్పొరేషన్ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు కిరణ్, శివకేశవ. వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓబులేష్. ప్రసాద్, ఖాదర్ పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల వితరణ


రంజాన్ కిట్లు అందజేస్తున్న ప్రతినిధులు

కడప కల్చరల్: పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కడప బెల్లమండి వీధిలోని మదరస జేహరలో పేదలకు బుధవారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. స్థానిక జమా అతె ఇస్లామి హింద్ పక్షాన సంస్థ ప్రతినిధులు 250మందికి బియ్యంతోపాటు నిత్యావసర సరుకుల కిట్లను పేదలకు అందజేశారు. పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాకీర్, డాక్టర్ అబ్దుల్లా, వీఎస్ రహమతుల్లా, జాఫర్ సాహెబ్, జమీల్, పఠాన్ షౌకత్ అలీ ఖాన్, హయాత్‌బాషా పాల్గొన్నారు.


దేవునికడప సోమేశ్వరస్వామి


మృత్యుంజయకుంటలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

శివ శివ శంకర...భక్త శుభంకర

- మార్మోగిన శివనామం
- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- నగర శివాలయాల్లో ఘనంగా పూజలు
- కనిపించిన కుంభమేళా, శోభా యాత్రల ప్రభావం

కడప కల్చరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని బుధవారం నగర వాసులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 3 గంటల నుంచి కుటుంబాలతో కలిసి శివాలయాలకు వెళ్లారు. విశేష అభిషేకాలనంతరం ఐదు గంటల తర్వాత భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తులు క్యూలైన్లలో వేచియుండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నగరంలోని శివాలయాలన్నీ భక్తులతో సందడిగా కనిపించాయి. పురాతన ఆలయాలలో ఒకటైన దేవుని కడప సోమేశ్వరస్వామి ఆలయం, మోచంపేట ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయం, గడ్డిబజారు సోమసుందరేశ్వరస్వామి ఆలయం, నబీకోట మల్లికార్జున, సర్వ మంగళాదేవి ఆలయం, మృత్యుంజయకుంట శివాలయం, ప్రకాశ్‌నగర్‌లోని అమరేశ్వరస్వామి ఆలయం, మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం, ఇంకా హౌసింగ్‌బోర్డులోని శివాలయాలు, సీపీ బ్రౌన్, మారుతినగర్, రవీంద్రనగర్ తదితర శివాలయాల్లో నగర సంకీర్తన, లింగాష్టకం, బిల్వ పత్ర పూజలు, రుద్రహోమాలు నిర్వహించారు. ఉదయం పది గంటలకు సాయంత్రం 4.00 గంటలకు, రాత్రి 7.00 గంటలకు దాదాపు అన్ని శివాలయాల్లోనూ శివపార్వతుల కల్యాణోత్సవాలను కనులపండువగా నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఇటీవల ప్రయాగలో జరిగిన కుంభమేళాకు జిల్లా నుంచి పలువురు భక్తులు హాజరుకావడం, నగరంలో మూడుసార్లు మహా శోభాయాత్రలు జరగడం శివరాత్రిపై ప్రభావం చూపింది. భక్తులు మునుపటి కంటే గణనీయంగా పెరగడం గమనార్హం.

జాగరణలు – శివరాత్రి నాడు శివపూజలు చేసినా, శివనామ స్మరణ చేసినా, శివనామం విన్నా ముక్తి లభిస్తుందన్న విశ్వాసం లభిస్తుండడంతో పలువురు భక్తులు శివాలయాల్లో జాగరణలు చేశారు. ఈ సందర్భంగా హరికథలతో శివపురాణాన్ని నిర్వహించారు. మరికొన్నిచోట్ల సంగీత కచేరీలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు.

ఆకట్టుకుంటున్న జ్యోతిర్లింగాల ప్రదర్శన

కడప బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఓం శాంతి నగర్ వీధిలోని జిల్లా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగాల నమూనాల ప్రదర్శన నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జ్యోతిర్లింగ క్షేత్రాలైన కేదార్‌నాథ్, సోమనాథ్, వైద్యనాథేశ్వర్, విశ్వనాథ్, నాగేశ్వర ఓంకారేశ్వర, త్రయంబకేశ్వర, మల్లికార్జున, భీమ శంకర, రామేశ్వర, ఘృష్ణేశ్వర తదితర జ్యోతిర్లింగాల నమూనాలను జిల్లా శాఖ కో ఆర్డినేటర్ గీతా బెహన్ ఆధ్వర్యంలో సభ్యులు ఆకర్షణీయంగా ఏర్పాటుచేశారు. పారిశ్రామికవేత్త బండారు సంపత్‌కుమార్‌జైన్, వెల్‌నెస్ కోచ్ ఐ.చైతన్యభాస్కర్ అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. బ్రహ్మకుమారీలు ప్రదీప, కావ్య అక్కయ్యలు భక్తులచే ప్రతిజ్ఞ చేయించారు.


మోచంపేట ప్రసన్న విశ్వేశ్వరస్వామి


నెహ్రూనగర్‌లో స్వామికి అలంకరణ


హౌసింగ్‌బోర్డులో బిల్వార్చన


నగర సంకీర్తన జరుపుతున్న భక్త బృందం


జ్యోతిర్లింగాల ప్రదర్శనను పారంభిస్తున్న బండారు సంపత్‌కుమార్ జైన్


శివరాత్రి రోజున ప్రత్యేక అలంకారంలో మృత్యుంజయేశ్వరుడు

పొలతల క్షేత్రం.. భక్త సంద్రం

పెండ్లిమర్రి: శంభో శంకర ...హర హర మహదేవ.. అంటూ భక్తజనధ్వనాల మధ్య పొలతల క్షేత్రం కిటకిటలాడింది. జిల్లా నలమూలల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చి మల్లేశ్వరుడు, పార్వతీదేవిని దర్శించుకున్నారు. కోనేటిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. మరి కొందరు మహిళా భక్తులు తమ మొక్కులబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎస్పీ అశోక్‌కుమార్, ఆలయ నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.


పొలతలకు వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న క్షేత్రం


కల్యాణోత్సవంలో భాగంగా మంగళ సూత్రం చూపుతున్న పండితుడు


స్వామి వారికి మొక్కులు చెల్లించేందుకు పూల గంపలతో భక్తులు


కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు


పొలతల క్షేత్రం వీధుల్లో జనం


మొక్కులు చెల్లించేందుకు తరలివస్తున్న జనం


శివుడి భారీ విగ్రహం వద్ద భక్తులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలి

సీఎం చంద్రబాబుకు కాంగ్రెస్ పార్టీ లేఖ


మహాత్ముడికి లేఖ సమర్పిస్తున్న నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టం–2024ను వ్యతిరేకించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేయబోమని ఓ తీర్మానాన్ని ఆమోదించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కాంగ్రెస్ పార్టీ బహిరంగ లేఖ రాసింది. కడప ఐటీఐ సర్కిల్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ కమిటీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ లేఖను బుధవారం గాంధీకి సమర్పించి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ పాత వక్ఫ్ రక్షణ చట్టం–1995ను మాత్రమే రాష్ట్రంలో అమలు చేస్తామని, మరో అనుబంధ తీర్మానాన్ని ఆమోదించాలని బహిరంగ లేఖలో కోరారు. రాష్ట్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల నుంచి మైనార్టీలను రక్షిస్తామని చంద్రబాబు శాసన సభలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొత్త వక్ఫ్ చట్టం అమలుకు కేంద్రం ఒత్తిడి తెస్తే.. వెంటనే మద్దతు ఉపసంహరించాలని చంద్రబాబును కోరారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని బహిరంగ లేఖలో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మయానా రహంతుల్లా ఖాన్, ఎస్.హమీద్, దినకర్‌రెడ్డి, కమల్‌బాషా, జహూర్, రహంతుల్లా, మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం చేస్తే చరిత్ర హీనులవుతారు

బద్వేలు అర్బన్ : పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించి వారికి అన్యాయం చేయాలని చూస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, పి.సుబ్బరాయుడులు తెలిపారు. సి.కొత్తపల్లె, చెన్నంపల్లె గ్రామపొలాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని గత ఆరు రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు బుధవారం వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైతే పట్టించుకోని రెవెన్యూ అధికారులు నిరుపేదలు వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. పేదలకు న్యాయం చేయకపోతే జిల్లా వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

జిల్లా వ్యాప్తంగా మొల్ల జయంతి ఉత్సవాలు

వల్లూరు : సాహితీ యాత్రలో భాగంగా మహా కవయిత్రి మొల్ల జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా బుధవారం వల్లూరులోని ప్రాచీన శివాలయంలో సాహితీ యాత్ర బ్యానర్‌ను అర్చకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఆయా ప్రాంతాల విద్యార్థులకు, ప్రజలకు అక్కడి చారిత్రక, పౌరాణిక, సాహిత్య నేపథ్యం తెలియజేస్తూ ఈ యాత్రలు సాగుతున్నాయని అన్నారు. సీపీ బ్రౌన్, గిడుగు వెంకట రామమూర్తి పంతులు, కవయిత్రి మొల్లమాంబ మొదలగువారికి తెలుగు ప్రజలు ఎంతో రుణపడి ఉన్నారన్నారు. మార్చి 13వ తేదీతో ముగియనున్న ఈ యాత్రలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి తేనెలొలుకు తెలుగు భాష రుచి చూపించి, బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నరసింహమూర్తి, ఎంఎల్ఎస్ శర్మ, శ్రీమతి సుచరిత, చంద్రశేఖర్, దీపక్ దీక్షిత్, నాగరాజ శర్మ, హర్ష, పవన్ సాయి పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె: మండలంలోని తలపనూరు గంగమ్మతల్లి ఆలయ 32వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా ముగిసింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు గంగమ్మతల్లికి సమర్పించిన పట్టు వస్త్రాలకు ఆలయ నిర్వాహకులు వేలంపాట నిర్వహించగా రూ.20 వేలు ఆదాయం వచ్చింది. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు.

ఫ్లెక్సీ జారింది.. దారి తప్పింది



కడప నగరంలో ఎక్కడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదంటూ గత నెలలో మున్సిపల్ అధికారులతో జరిగిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మాధవిరెడ్డి హుకుం జారీ చేశారు. వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. నగరం లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ రోడ్డుకు అడ్డంగా ఇలా పడిపోయింది. వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. – సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

దుమ్ముతో.. భక్తుల అవస్థ





పొలతల క్షేత్రానికి వెళ్లే దారిలో ఘాట్ రోడ్డు వద్ద వన్‌వే కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ గ్రావెల్‌కు బదులు మట్టి తోలడంతో భారీ వాహనాలు వెళ్లేటపుడు దుమ్ము, ధూళి లేచి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఒక వాహనాన్ని మరో వాహనం దాటాలంటే ప్రయాస పడాల్సి వచ్చింది. ఇదే అవకాశం అన్నట్లు మార్గ మధ్యంలో దేవస్థానం తరపున అంటూ కొందరు వాహనాలదారుల నుంచి రూ. 200–500 వరకు వసూలుచేశారు. – మహమ్మద్ రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్